క్లుప్తంగా

పూజారి తీరుపై విమర్శలు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ పూజారి తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి ఆలయానికి భక్తులు పోటెత్తగా అర్చకుడు అతడికి సాన్నిహిత్యం ఉన్న వారిని ప్యాంట్ వేసుకున్నా అభిషేకానికి అనుమతించి ఇతర భక్తులను మాత్రం పంచె కట్టుకొస్తేనే అనుమతిస్తామనంతో భక్తులు విస్తుపోయారు. పూజారి పక్షపాత వైఖరి అవలంభిస్తున్నాడంటూ పలువురు అసహనం వ్యక్తం చేశారు. పూజారి తీరుపై దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఎలక్ట్రిక్ ఆటో దగ్ధం



గీసుకొండ : ఎలక్ట్రిక్ ఆటో దగ్ధమైన ఘటన మండలంలోని కొమ్మాలలో బుధ వారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన బోగి శివకుమార్ మనుగొండకు చెందిన తన బంధువు పేరిట కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఎప్పటిలాగే బుధ వారం రాత్రి తన ఇంటి పక్కన ఆటోను నిలిపి ఇంట్లో నిద్రిస్తుండగా ఆటోలో మంటలు చోటు చేసుకుని సీట్లు, టాప్ కవర్, లైట్లు, వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుడు గురు వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గీత కార్మికుడికి గాయాలు

వర్ధన్నపేట : మండలంలోని క్యాత్యాలకు చెందిన గీత కార్మికుడు చెంగల శ్రీనివాస్ బుధ వారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. శ్రీనివాస్ కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి దిగుతుండగా ప్రమావశాత్తు పట్టు తప్పి పడిపోయాడు. గాయాలపాలైన శ్రీనివాస్‌ను తోటి గీత కార్మికులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు

పరామర్శ



నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తల్లి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి సోదరి గోగుల జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. తొలుత జయశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాణి రుద్రమరెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, రాయిడి రవీందర్‌రెడ్డిలతో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. జయశ్రీ మృతిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తదితరులు



పర్వతగిరి : పర్వతాల శివాలయంలో పూజ చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, తదితరులు



సంగెం : రామలింగేశ్వరాలయంలో కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, భక్తులు

హరహర మహాదేవ..

హరహర మహాదేవ.. అంటూ జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహాశివ రాత్రిని పురస్కరించుకుని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, దుగ్గొండి, నెక్కొండ, గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట, ఖానాపూర్, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే పరమశివుడి ఆశీస్సుల కోసం భక్తులు ఆలయాలకు చేరుకోవడం మొదలైంది. అర్చకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, భక్తులు అభిషేకాలు నిర్వహించారు. 'శంభో శంకర.. హరహర మహాదేవ్.. ఓం నమఃశివాయ..' అంటూ భక్తిపారవశ్యాన్ని చాటారు. పలు ఆలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఊరేగించారు. అర్ధరాత్రి 12.03 నుంచి 12.52 గంటల వరకు లింగోద్భవ సమయంలో పరమేశ్వరుడికి బిల్వ దళాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి పరమశివుడి ఆరాధనలో ఉన్న భక్తులు అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : పట్టణంలోని శివాంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి



ఖానాపురం : కొత్తూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నెక్కొండ : రామలింగేశ్వరాలయంలో..



నెక్కొండ: రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సంగెం : సంఘమేశ్వరాలయంలోని మంచు లింగం వద్ద..



పర్వతగిరి : రామలింగేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



వర్ధన్నపేట : శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



నల్లబెల్లి : రాజరాజేశ్వరస్వామి ఆలయంలో..



దుగ్గొండి : శివపార్వతుల కల్యాణం..



చెన్నారావుపేట : సిద్ధేశ్వరాలయంలో..

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలానికి చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భువనగిరి జిల్లా ఆలేరులో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మ తండాకు చెందిన బానోత్ కిషన్–శాంతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, కుమారుడు బానోత్ వెంకన్న (24) ఉన్నారు. కిషన్ కొన్నేళ్ల క్రితం మృతి చెందగా శాంతమ్మ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. నలుగురు కుమార్తెలు వివాహం జరిపించింది. కుమారుడు వెంకన్న డిగ్రీ పూర్తి చేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు స్వగ్రామానికి చెందిన మరో స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ శిక్షణ పొందుతున్నాడు. సుమారు 10 నెలల క్రితం వెంకన్నకు జనగామ జిల్లాలోని సోదరి కూతురుతో వివాహం నిశ్చయమైంది. నిశ్చితార్థం కూడా జరిగింది. రెండ్రోజుల క్రితమే హైదరాబాద్ నుంచి ముత్యాలమ్మతండాకు వెంకన్న వచ్చి వెళ్లిపోయాడు. కాగా వెంకన్న నేరుగా హైదరాబాద్‌లోని తన రూముకు వెళ్లకుండా ఉప్పల్‌లో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లి బుధవారం ఉదయమే నర్సంపేటకు బయల్దేరాడు. ఇదిలా ఉండగా వెంకన్న ఆలేరు సమీపంలోని టంగుటూరు గ్రామ శివారులోని కెనాల్ వద్ద తుమ్మచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. వెంకన్న వద్ద లభించిన ఆధారాలతో బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. వెంకన్న తల్లి, బంధువులు ఆలేరుకు బయల్దేరి వెళ్లారు. వెంకన్న ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అండర్ బ్రిడ్జి.. అడుగడుగునా గుంతలు

- నిర్మాణంలో నాణ్యతాలోపం
- ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం



గుంతలు తేలిన ఎల్గూర్ రంగంపేట అండర్ బ్రిడ్జి



సంగెం : అధికారుల నిర్లక్ష్యం ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్–విజయవాడ మార్గంలో థర్డ్ లైన్ నిర్మాణం పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలకు లెవల్ క్రాసింగ్ గేట్లు అడ్డంకిగా ఉండకుండా రైల్వే శాఖ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించేందుకు ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టిన క్రమంలో ఎల్గూర్ రంగంపేట వద్ద ఉన్న 68/ఇ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను 2024 మార్చి 22న పూర్తిగా తొలగించిన విషయం తెలిసిందే. అనంతరం రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించి హడావుడిగా ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా బ్రిడ్జి నిర్మించడం వల్లే అడుగడుగునా గుంతలు తేలి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యలో గుంతలు పడగా పూడ్చినా మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి కింద నీరు నిలిచి గుంతలు కనపడక పలువురు ప్రమాదవశాత్తు కింద పడిపోయి ఆస్పత్రి పాలవుతున్నామని పలువురు వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎరువుల బస్తాలు, ప్రజలు సరుకులను ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లే సమయాంల్లో గుంతల్లో పడిపోయి సరుకులు సైతం పనికి రాకుండా పోతున్న దుస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలు లేకుండా నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్డు నిర్మించి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గుంతల్లో వాహనాలు పడిపోయి..



ద్విచక్ర వాహనంపై ఎరువుల బస్తాలు తీసుకెళ్లే సమయాంలో గుంతల్లో బండి పడిపోయింది. నాకు స్వల్ప గాయాలవగా వాహనమూ దెబ్బతిన్నది. ఎరువుల బస్తాలు తడిచి పనికి రాకుండాపోయాయి. పలువురు ప్రమాదవశాత్తు అదుపు తప్పి గుంతల్లో పడి ఆస్పత్రి పాలయ్యారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– కడారి చంద్రమౌళి, రైతు, ఎల్గూర్ రంగంపేట

రాత్రివేళ గుంతలు కనపడక..



రాత్రివేళల్లో గుంతలు కనపడక ద్విచక్ర వాహనదార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల్లో నీరు నిలిచి లోతు గుర్తించలేని స్థితిలో వాహనాలతో సహా వాహనదార్లు పడిపోతున్నారు. చీకటిలో ద్విచక్ర వాహనదారులకు గుంతలు కనపడక సైతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతల పూడ్చివేతలో నాణ్యత పాటించాలి.

– నంద్యాల సతీశ్, ఎల్గూర్ రంగంపేట

గుంతలను పూడ్చివేస్తాం

గుంతలు తేలిన మాట వాస్తవమే. గుంతలతో రైతులు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి 1న పనులు చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. గుంతలు పూడ్చేటపుడు రవాణా తగ్గించుకుని ప్రజలు సహకరించాలి. గుంతలు పూడ్చివేయించే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తాం.

– శ్రీనివాస్, ఐఓడబ్ల్యూ, రైల్వే శాఖ

మహిళా సంఘాల సభ్యులకు బీమా

- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు
- సహజ మరణానికి రూ.2 లక్షలు
- వైకల్యానికి రూ.5 లక్షల ప్రయోజనం



మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

ఖానాపురం : మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్న విషయం తెలిసిందే. మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకుని సంఘంలోని సభ్యులు రుణాలు పొందుతూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే అనేక మంది మహిళలు రుణాలు తీసుకుని వ్యాపారాలు సైతం చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే మహిళలకు మరింత అండగా నిలిచేలా ప్రభుత్వం నూతన కార్యక్రమాలు చేపడుతోంది.

మండలంలో 836 మహిళా సంఘాలుండగా 8821 మంది సభ్యులున్నారు. అర్హత కలిగిన ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరేలా ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించడానికి నిర్ణయించింది. ఇందులో రుణ, ప్రమాద బీమా ఉండడం గమనార్హం. మహిళలు వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధితోపాటు మరికొన్ని పథకాల ద్వారా ఒక్కో సంఘానికి రూ.5–20 లక్షల వరకు రుణాలు అందజేస్తోంది. రుణం పొందిన మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందితే కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. సంఘాల్లో సభ్యురాలిగా ఉండి స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్న మహిళ సహజ మరణం చెందితే రూ.2 లక్షలలోపు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించనుంది. గతేడాది మార్చి 14 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో సభ్యురాలు మృతి చెందిన లేదా అంగవైకల్యం కలిగిన వారికి బీమా వర్తిస్తుంది. ఈ విధానాన్ని బ్యాంకు తాజాగా లింకేజీ రుణాలకు సైతం వర్తింపజేస్తోంది.

18–60 ఏళ్ల వరకు వయస్సున్న సభ్యులు అర్హులు

పొదుపు సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు బీమా సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షలు, వంద శాతం వైకల్యం కలిగితే రూ.10 లక్షలు, 50 శాతం వైకల్యం కలిగితే రూ.5 లక్షలను ప్రమాద బీమా కింద చెల్లిస్తారు. మృతి చెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళలకు అంగవైకల్యం నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్, ఆస్పత్రి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 18 నుంచి 60 ఏళ్ల నడుమ వయస్సున్న మహిళలు ఈ పథకానికి అర్హులు. మండల సమాఖ్య అధికారులు ఇప్పటికే మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. మండల పరిధిలో పలువురు సహజ మరణం చెందగా ప్రభుత్వానికి వారి వివరాలు అందజేశారు.

సమర్పించాల్సిన పత్రాలివే

మహిళా సంఘాల్లోని సభ్యులు మృతి చెందితే పలు ధృవీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. ఇందులో మరణ ధృవీకరణ పత్రం, ఆధార్, ఎస్‌హెచ్‌జీ, వీఓ తీర్మాణాలు, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్ట్, బ్యాంక్ పాస్‌బుక్ అందజేయాలి.

ఇప్పటివరకు ఆరుగురి మృతి



మండల పరిధిలో ఇప్పటివరకు ఆరుగురు మహిళా సంఘాల సభ్యులు సహజ మరణం చెందారు. వారికి బీమా వర్తింపజేసేలా ప్రభుత్వానికి నివేదికలు పంపించాము. మహిళా సంఘాల్లోని మహిళలకు బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. బీమాతో మహిళల కుటుంబాలకు సైతం భరోసా లభించనుంది. మహిళా సంఘాల సభ్యులు బీమా పథకాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలి. తద్వారా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి.

– కందిక సుధాకర్, ఏపీఎం, ఖానాపురం

ట్రాలీ కిస్తీలు కట్టడంలో ఇబ్బందులు

- మనస్తాపంతో భర్త ఆత్మహత్య

గూడూరు: బతుకుదెరువు కోసం టాటా ఏస్ ట్రాలీ కొనుగోలు చేశాడు. ఇందు కోసం రూ.5.50 లక్షలు ఫైనాన్స్ తీసుకొని కిస్తీలు కడుతున్నాడు. ఈక్రమంలో కిస్తీలు కట్టడం ఇబ్బంది కావడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భర్త మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన పిట్టల వీరన్న (40) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో టాటాఏస్ ట్రాలీ ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. ట్రాలీ కిస్తీలు కట్టడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన వీరన్న బుధవారం ఉదయం వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.